www.vastavam.in

# వాస్తవం.ఇన్

డిజిటల్ పత్రిక

ఎడిటర్: దండుగుల శ్రీనివాస్

News you can trust

| శుక్రవారం | 20-06-2025 |

## పోలీస్ కస్టడీకి నూనె శ్రీధర్



వాస్తవం, హైదరాబాద్:

కరీంనగర్ జిల్లా చొప్పదండి డివిజన్ ఈఈ నూనె శ్రీధర్‌ను 5 రోజుల కస్టడీకి ఏసీబీ కోర్టు అనుమతిం చింది. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో శ్రీధర్‌ను ఏసీబీ అధికారులు అరెస్టు చేయగా.. ప్రస్తుతం చంచల్‌గూడ జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. చంచల్‌గూడ జైలు నుంచి కస్టడీకి తీసుకొని ఐదురోజుల పాటు శ్రీధర్‌ను.. ఏసీబీ అధికారులు విచా రించనున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో నూనె శ్రీధర్ కీలకంగా పనిచేసిన విషయం తెలిసిందే. ఆయన ఇళ్లు, బంధువుల నివా సాల్లో సోదాలు చేసిన ఏసీబీ అధికారులు రూ.150 కోట్లకు పైగానే అక్రమాస్తులున్నట్టు గుర్తించారు.

## నా సెల్‌ఫోన్ ఇయ్యాల్నా...!?


# చచ్చినా ఇయ్య...!



- అది నా వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం..!
- సెల్‌ఫోన్ ఇవ్వాల్సిందేనంటున్న ఏసీబీ
- కుదరదంటున్న మాజీమంత్రి కేటీఆర్
- సెల్‌ఫోన్ వ్యవహారంపై పట్టుదలగా ఏసీబీ

వాస్తవం, హైదరాబాద్:

ఫార్ములా ఈ కార్ రేస్ కేసు ఇప్పుడు సెల్ ఫోన్ చుట్టూనే తిరుగుతుంది.. కేటీఆర్ సెల్‌ఫోనే ఏసీబీ అధికారులకు కీలకంగా మారింది.. సెల్ ఫోను ఇచ్చేది లేదని కేటీఆర్ ఏసీబీకి కరాకండిగా తేల్చి చెప్పారు.. గతంలో వాడిన సెల్ ఫోను ఇప్పుడు తన దగ్గర లేదని, ఇప్పుడు కొత్త ఫోన్ వాడుతున్నానని చెప్పారు.. ఇందుకు సంబంధించి లిఖిత పూర్వకంగా ఏసీబీ అధికారులకు కేటీఆర్ సమాధానం పంపాడు.. అయితే ఫోన్ ఇవ్వకపోతే తదుపరి చర్యలకు తాము సిద్ధమని ఏసీబీ అధికారులు అంటున్నారు.. ఎలాంటి చర్యలు తీసుకుంటారనీ ఏసీబీ మాత్రం చెప్పడం లేదు. మరోవైపు వ్యక్తిగత గోప్యత భంగం కలిగించే విధంగా ఫోన్ అడగడం చట్ట వ్యతిరేకమని కేటీఆర్ వాదిస్తున్నాడు.. సెల్ ఫోనుకు సంబంధించిన వ్యవహారంలో సుప్రీంకోర్టు తీర్పులు ఉన్నాయని, దాని ప్రకారం ఎవరు కూడా వ్యక్తిగత సమాచారం సెల్ఫోన్ లాంటివి అడగవద్దని అంటున్నారు.. అంతే కాదు.. అసలు తన సెల్ ఫోన్ ఏసీబీ వాళ్లకు ఎందుకు అవసరం ఉందో అనే విషయాన్ని చెప్పడం లేదని అంటున్నారు.. దానికి తోడు తన సెల్ ఫోన్‌తో వాళ్లకు ఏవిరీ పని అని ప్రశ్నిస్తున్నారు.. ఏది ఏమైనా తాను మాత్రం సెల్ఫోన్ ఇచ్చేది లేదని అంటూనే, మరొకవైపు ఈ ఏడాది నుంచి తాను కొత్త సెల్ ఫోన్ వాడుతున్నట్లు తెలిపారు.. 2021-2023 మధ్యకాలంలో కేటీఆర్ వాడిన సెల్ఫోన్ ఇవ్వాలని ఏసీబీ అధికారులు ఆదేశించారు.. అయితే ఆ కాలంలో వాడిన సెల్ ఫోన్ తన దగ్గర లేదని ఇప్పుడు కొత్త సెల్ ఫోన్ వాడుతున్నానని చెప్పారు.. సెల్ ఫోన్ ఇవ్వడానికి అసలు కేటీఆర్ ఎందుకు వెనుక ముందు ఆడుతున్నాడో అర్థం కావడం లేదని ఏసీబీ అధికారులు చెప్తున్నారు.. సెల్ఫోన్ ఇస్తే తమకు కావాల్సిన సమాచారాన్ని తీసుకుంటామని వాళ్లు వాదిస్తున్నారు..ఫార్ములా ఈ కార్ రేస్ సంబంధించిన వ్యవహారాలు అన్నీ కూడా విచారించాలంటే సెల్ ఫోను ఒక సాక్ష్యంగా తమకు ఉపయోగపడుతుందని తప్పనిసరిగా కేటీఆర్ దానిని తెచ్చి ఇవ్వాల్సిందేనని ఎసిబి అధికారులు వాదిస్తున్నారు.. మరోవైపు ఈ కేసులో ఏసీబీకి పూర్తిస్థాయిలో సహకరించాలని విచారణ ఎదుర్కోవాలని ఇప్పటికే హైకోర్టు చెప్పింది..చారణ సమయంలో ఏసీబీ అధికారులు అడిగిన ప్రతిదానికి సమాధానం చెప్పవలసి ఉంటుంది.. అంతేకాదు వాళ్లు అడిగిన సాక్ష్యాలను కూడా అందజేయవలసి ఉంటుంది.. కానీ ఇప్పుడు కేటీఆర్‌ను అడిగిన సెల్ఫోన్లు లేవని చెప్పడంతో తదుపరిగా ఏసీబీ ఏం చేస్తుందనేది అందరూ ఉత్కంఠతో ఎదురుచూస్తున్నారు. రెండు సార్లు ఏసీబీ అధికారులు కేటీఆర్‌ను విచారించారు..ఈ సమయంలో తమకు సహకరించలేదని ఏసీబీ అధికారులు కోర్టుని ఆశ్రయించే అవకాశముంది.



# రైతు భరోసా

# రప్పారప్పా..!

**తొలిసారిగా ఇప్పుడే ఇలా ఆగకుండా వడివడిగా..**

**సరైన సమయంలో పెట్టుబడి సాయం.. ఆనందంలో రైతాంగం..**

**నాలుగు రోజుల్లో రూ. 6,405 కోట్లు ఖాతాల్లో జమ..**

**1.06 కోట్ల ఎకరాలకు.. 62 లక్షల మంది రైతులకు భరోసా నిధులు..**

**మరో ఐదు రోజుల్లో 43 లక్షల ఎకరాలకు 8 లక్షల మంది రైతులకు..**

**9 రోజుల్లో రూ. 9 వేల కోట్లు లక్ష్యంగా రైతుభరోసా వేసేందుకు ప్రణాళిక..**

(దండుగుల శ్రీనివాస్)

కాంగ్రెస్ సర్కార్ వచ్చినప్పట్నుంచి ఇదే మొదటి సారి. రైతు భరోసా నిధులు ఆగకుండా వరుసపెట్టి రప్పారప్పా పైసలు ఖాతాల్లో జమ కావడం. ఆది నుంచి ఈ పథకానికి ఆటుపోట్లే. ప్రధానంగా నిధుల లేమితో వివిధ కారణాలు, సాకులు చూపుతు సర్కార్ ఈ నిధులను రైతులకు పూర్తి స్థాయిలో అందించకుండా ఎగ్గొడుతూ వస్తోంది. కమిటీ పేరుతో మొదటి సంవత్సరం ఎగ్గొట్టింది. ఆ తరువాత క్లారిటీ ఇచ్చి.. ఇగ వేస్తున్నాం అని చెప్పి మూడెకరాలకే సరిపెట్టింది. ఆ తరువాత దాన్ని ఆపేసింది. ఇగో ఇప్పుడు మల్లా మొదలు పెట్టింది. కానీ ఈసారి చెప్పింది చెప్పినట్టుగానే మొదలు పెట్టిన దగ్గర్నుంచి రప్పారప్పా పైసలైతే ఖాతాల్లో పడుతున్నాయి. సీఎం చెప్పినట్టుగా తొమ్మిది రోజుల్లో రూ. 9వేల కోట్లు వేస్తామన్నారు.. ఇగ వేస్తున్నారు. ఇప్పటికే నాలుగు రోజుల్లో 1.06 కోట్ల ఎకరాల పరిధిలో ఉన్న 62 లక్షల మంది రైతులకు రైతు భరోసా కింద ఎకరాకు 6వేల చొప్పున రూ. 6, 405 కోట్లు ఖాతాల్లో జమ చేసింది సర్కార్. మొత్తం రాష్ట్ర వ్యాప్తంగా 1.49 కోట్ల ఎకరాల వరకు సాగుయోగ్యమైన భూములన్నాయని సర్కార్ గుర్తించింది. వీటి కోసం ఏటా ప్రతీ సీజన్‌కు రూ. 9వేల కోట్లు అవసరం పడతాయని లెక్కలేసింది. ఇప్పుడు ఇది వరుస పెట్టి ఒక ఎకరం నుంచి మొదలు పెట్టి వరుసగా ఎకరాలను పెంచుతూ ఇస్తూ పోతున్నారు. ఇప్పటి వరకు 5 ఎకరాల లోపు ఉన్నవారికి వేసేశారు. ఇక ఐదెకరాల పైన.. ఉన్న రైతులందరికీ వేయనున్నారు. దీనికి మరో ఐదు రోజులు గడువు పెట్టుకున్నారు. ఈ గడువులోగా 43 లక్షల ఎకరాల పరిధిలోని 8 లక్షల మంది రైతులకు రూ. 4, 600 కోట్ల రైతు భరోసా పైసలు జమ చేయనున్నారు. ఇన్ని రోజులు ఆపి ఇబ్బంది పెట్టినా.. ఈ వానాకాలం సీజన్‌లో సరైన సమయంలో పెట్టుబడి సాయం అందించడంతో రైతులకు ఎంతో ఊరటగా ఉంది. రైతాంగం హర్షం వ్యక్తం చేస్తోంది. ఇది ఎన్నికల స్టంట్‌గా కాకుండా ఎప్పుడూ సీజన్‌కు ముందే రప్పారప్పా పైసలు ఖాతాల్లో వేయాలని కోరుకుంటున్నారు.

# ఢిల్లీకి వెళ్తే రాహుల్‌నే కలవాలా..?



**విన్నపాలు వినవలె.. సమస్యలు పరిష్కరించాలె...!**

**హస్తినలో రేవంత్ టీమ్ బిజీబిజీ..**

రేవంత్ పదే పదే ఢిల్లీకి వెళ్తున్నాడు.. ఇప్పటికే హాఫ్ సెంచరీ పూర్తయిందని ఓ వైపు కేటీఆర్, మరోవైపు కవిత దుమ్మెత్తిపోస్తున్నారు. రాహుల్‌గాంధీ వారికి టైమ్ కూడా ఇవ్వడం లేదంటూ ఎద్దేవా కూడా చేస్తున్నారు. కానీ ఢిల్లీ వెళ్లిన ప్రతీసారి రాహుల్‌ని కలవాలని ఏం రూల్ లేదు. రాష్ట్ర ప్రయోజనాల కోసం ఎన్నిసార్లైనా ఢిల్లీకి వెళ్తానని బదులిచ్చాడు సీఎం రేవంత్. గురువారం ఆయన తన టీమ్‌తో ఢిల్లీ వెళ్లిన నేపథ్యం .. బిజీబిజీగా తెలంగాణ అంశాలను ప్రస్తావించిన వైనం బాగుంది. బనకచర్ల ప్రాజెక్టును అడ్డుకోవాలని కేంద్రాన్ని కోరడంతో పాటు మెట్రో రెండో దశ ప్రాజెక్టుపైనా సీఎం విన్నవించాడు. యూకే మాజీ ప్రధాని టోనీ బ్లెయిర్‌నీ కలిశాడు. తప్పదు ఢిల్లీ పోవాల్సిందే. అందర్నీ కలవాల్సిందే. విన్నపాలు వినపించాల్సిందే. సమస్యలు పరిష్కరించాల్సిందే. రాహుల్‌తో ఫోటో ఏదీ..? రాహుల్ టైం ఇవ్వలేదట కదా. ఎందుకు ఇన్నిసార్లు ఢిల్లీ వెళ్తున్నారు..? ఇవన్నీ ప్రతిపక్షాల కామన్ ఎత్తిపాడుపులే. సీఎం ఢిల్లీ టూర్‌తో ఏం ప్రయోజనం సమకూరిందనేదే పాయింట్. - దండుగుల శ్రీనివాస్

### ‘తెలంగాణ రైజింగ్ 2047’ విజన్ భేష్

తెలంగాణ సర్వతోముఖాభివృద్ధికి ఉద్దేశించిన తెలంగాణ రైజింగ్-2047 విజన్ అద్భుతంగా ఉందని యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే) మాజీ ప్రధానమంత్రి టోనీ బ్లెయిర్ ప్రశంసించారు. భారత్ పర్యటనలో ఉన్న టోనీ బ్లెయిర్‌తో ఢిల్లీలో సీఎం రేవంత్‌రెడ్డి గురువారం సమావేశమయ్యారు. తెలంగాణ రైజింగ్ 2047 ముఖ్య అంశాలను తెలియజేస్తూ, ఈ విజన్‌ను 2025, డిసెంబర్ 9న రాష్ట్ర ప్రభుత్వ రెండో వార్షికోత్సవం సందర్భంగా ప్రజలకు వెల్లడించనున్నట్లు సీఎం తెలిపారు. సుస్థిరాభివృద్ధి దిశగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రణాళిక ఉందని టోనీ బ్లెయిర్ ప్రశంసించారు.



### హైదరాబాద్ మెట్రో ఫేజ్-II మంజూరు చేయండి...

హైదరాబాద్ మెట్రో ఫేజ్-IIకు సత్వరమే అనుమతులు మంజూరు చేయాలని కేంద్ర పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌కు సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలో కేంద్ర మంత్రి ఖట్టర్‌తో ఆయన నివాసంలో సీఎం రేవంత్ రెడ్డి గురువారం సమావేశమయ్యారు. అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్ నగరంలో 76.4 కిలోమీటర్ల పొడవైన మెట్రో ఫేజ్-II అవసరం ఎంతో ఉందని ఆయనకు సీఎం తెలియజేశారు.



### బనకచర్లను అడ్డుకోండి

తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలకు విరుద్ధంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు ప్రీ ఫీజుబిలిటీ రిపోర్ట్‌ను తిరస్కరించాలని జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

# అక్క చుట్టూ దయ్యాలు..!

**ముగ్గురిని వెళ్లగొట్టిన కవిత...!**

**ఇంకా చాలా దయ్యాలే ఉన్నాయ్..**

**అవి పాతకుపోయాయి..!!**



(దండుగుల శ్రీనివాస్)

కేసీఆర్ దేవుడే. కానీ చుట్టూ దయ్యాలె ఉన్నాయన్నది కవిత. అదే డైలాగ్ ఆమెకూ వర్తించింది. మరి నీ దగ్గర దయ్యాల సంగతేందక్కా..? అని అడగడం మొదలుపెట్టారు. మొత్తానికి తన చుట్టూ ఉన్న దయ్యాలపై కూడా నజర్ పెట్టినట్టుంది కవిత. ఇప్పటి వరకు ముగ్గురికి చెక్‌పెట్టింది. ఇంకా చాలా దయ్యాలె ఉన్నాయి. వారంతా పాతుకుపోయారు. ఆమె చెవులు కొరుకుతూ ఉన్నవీ లేనివి చెప్పే దయ్యాలన్నమాట. జనాలతో కలవనీయరు. వచ్చిన వారిని ఇంట్లోకి పోనియరు. గేటు బయటే ఉంచుతారు. వారంతా ఎదురు చూసీ చూసీ వెళ్లిపోతారు. అలా కారులో కూర్చుని బయటకు వచ్చి ఆగకుండా అన్నా బాగున్నావే.. అని ఓ నవ్వు నవ్వి రయ్యిన కారులో వెళ్లిపోతుందీమే. బాగా అలవాటై పోయింది ఇలాగే. అందుకే జనాలు ఆమెకు దూరమయ్యారు. చుట్టూ చేరిన దయ్యాలు మరింత దూరం చేశారు జనానికి. కేసీఆర్ తన చుట్టూ దయ్యాలను పట్టించుకోలేదు. పట్టించుకోడు కూడా. ఎవరో తనకు చెబితే తను వింటాడా..? ఆ విషయం కవిత కూడా తెలుసు. కానీ తన ఉనికి చాటుకునే క్రమంలో ఆమె తప్పని సరి పరిస్థితుల్లో ఇలాంటి అంతర్గత విషయాలు బయటకు చెప్పాల్సి వచ్చింది. అన్న కేటీఆర్‌తో మంచి సంబంధాలుండి తన వద్ద ఉండే టీమ్‌లో ఉండే వారికి మొదట చెక్ పెడుతున్నదామె. ఆ తరువాత జనానికి, తనకు గ్యాప్ పెంచే టీమ్ మరొకటుంది. తన పేరు చెప్పుకుని బతికే పరాన్నబక్కులు ఇంకొందరున్నారు. వీరందరూ ఇప్పుడు ఇంకా ఆమె చుట్టే ఉన్నారు. ఉంటారు కూడా. ఆమెకు కొన్ని విషయాలు తెలిసినా తీసేయలేని పరిస్తితి. చాలా విషయాలు తెలిసినా పొమ్మనలేని దుస్థితి. అందుకే ఆ దేవుడి దగ్గర దయ్యాలు ఎలా పాతుకుపోయాయో.. ఈ దేవత దగ్గర కూడా అలాగే పాతుకుపోయాయి. అన్న కేటీఆర్ దగ్గరా ఉందండోయ్ ఓ దయ్యాల టీమ్. దాన్నీ ఎవరూ పారదోలలేరు. మొత్తంగా దేవుండ్లు, దేవతల చుట్టూ దయ్యాలు తిరుగుతున్నాయి. వీరిని బయటకు పంపే మంత్రం ఏంటో వారికింకా తెలియదు. అవి దయ్యాలే కావనుంటున్నాయి ఈ దేవుండ్ల, దేవతల టీమ్.